సాక్షి కామారెడ్డి

శనివారం । 21 । అక్టోబర్ । 2023



బీఆర్ఎస్‌తో పేదలకు మేలు

బీఆర్ఎస్ మేనిఫెస్టోతో పేదలకు మేలు చేకూరుతుందని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు.

- 3లో ▸



సీఎంకు బహుమతిగా ఇద్దాం

బీఆర్ఎస్‌ను ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ కోరారు.

- 3లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 18.4 /36.1

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రూ.16.81 లక్షలు స్వాధీనం



కామారెడ్డి క్రైం: ఎన్నికల సందర్భంగా పోలీసులు చేపడుతున్న తనిఖీల్లో భాగంగా శుక్రవారం భారీగా నగదు పట్టుబడింది. కామారెడ్డి పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు ఓ షాపింగ్ మాల్‌కు చెందిన వ్యాపారికి సంబంధించిన రూ.16,81,400 లను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనల మేరకు నగదును సీజ్ చేసి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు అప్పగించామని ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపారు.

పోలీసు అమరుల త్యాగాలు మరువొద్దు



కామారెడ్డి అర్బన్: పోలీసు అమర వీరుల త్యాగాలు మరువొద్దని ఎస్పీ సింధుశర్మ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పోలీసు కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో ఎస్పీతో పాటు 63 మంది పోలీసులు, అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు కృషి చేయాలన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ రాజన్న మాట్లాడుతూ ఎస్పీ సూచన మేరకు జిల్లాలోని ఆటో డ్రైవర్లతో పాటు వివిధ శాఖల సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ ఇప్పిస్తామన్నారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు బి రఘుకుమార్, రమేష్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సుభాష్‌రెడ్డి ఇంటికి గులాబీ నేతలు

సాక్షి, కామారెడ్డి: సొంత డబ్బులు రూ.ఆరు కోట్లతో బీబీపేటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆధునిక సౌకర్యాలతో భవనాన్ని నిర్మించిన తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డి ఇంటికి శుక్రవారం గులాబీ నేతలు వెళ్లి సంప్రదింపులు జరిపారు. బీబీపేట, దోమకొండతో పాటు భిక్కనూరు మండలాల్లో పలుకుబడి ఉన్న సుభాష్‌రెడ్డికి బీఆర్ఎస్ నేతలకు కొంత కాలంగా గ్యాప్ ఉంది. సుభాష్‌రెడ్డి ఇంటికి బీఆర్ఎస్ నాయకులెవరూ వెళ్లొద్దని అప్పట్లో హుకూం జారీ చేశారు. దీంతో వారి మధ్య మరింత గ్యాప్ పెరిగింది. అయితే ఇటీవల ప్రగతి భవన్ వేదికగా జరిగిన సమావేశంలో ఆ ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు సుభాష్ రెడ్డికి బాధ్యతలు ఇవ్వాలని కేటీఆర్‌ను కోరిన నేపథ్యంలో శుక్రవారం నియోజకవర్గానికి చెందిన ఇద్దరు ముఖ్య నేతలు వెళ్లి ఆయనతో చర్చించారు.

వ్యాసరచన పోటీలు

కామారెడ్డిఅర్బన్: పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఫొటోలు, వీడియోగ్రఫీ, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ సింధుశర్మ తెలిపారు. పోలీసులు చేసిన సేవలు, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢ నమ్మకాల నిర్మూలన, అత్యవసర సమయాల్లో పోలీసు స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసు సేవలు, పోలీసు కీర్తి ప్రతిష్టలు పెంపొందించే అంశాలపై తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో మూడు నిమిషాలకు మించకుండా వీడియోలు రూపొందించి https://forms.gle/FkhB8qy9wypwPVPC8 వెబ్‌సైట్‌కు ఈ నెల 26లోగా పంపాలన్నారు. ఇంటర్ విద్యార్థులు 'సమర్థవంతమైన పోలీసింగ్ కోసం సాంకేతిక పరిజ్ఞాన వినియోగం' అంశంపై, డిగ్రీ ఆపై చదివిన విద్యార్థులు 'సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర' అంశంపై వ్యాసాలను ఈనెల 27లోగా https:// forms. gle/ b7 bejvzfo6 j29 Vuz6 కు పంపాలని సూచించారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

కామారెడ్డి టౌన్: బ్యాంకర్లు తమ లాగిన్‌లో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో ఏర్పాటు చేసిన బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్రాప్‌లోన్, వీవర్స్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలన్నారు. పంట రుణాలు, బంగారంపై రుణాలు తీసుకొని క్లోజ్ అయిన ఖాతాలు, నూతన ఖాతాలు, ఆధార్ అనుసంధానం వంటి అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. లీడ్ బ్యాంక్ అధికారి భార్గవ్,డీఈవో భాగ్యలక్ష్మి, అదనపు డీఆర్‌డీవో మురళీకృష్ణ, నాబార్డు డీడీఎం ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో నూతనోత్సాహం

- మోర్తాడ్, ఆర్మూర్‌లలో రాహుల్‌గాంధీ కార్నర్ మీటింగ్‌లు
- అన్ని తానై పార్టీ తరఫున హామీలిచ్చిన అగ్రనేత
- ప్రత్యర్థులపై ఘాటు విమర్శలు
- సమావేశాల సక్సెస్‌తో శ్రేణుల్లో జోష్



మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

మోర్తాడ్‌లోని కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు

మోర్తాడ్/ఆర్మూర్ : రాష్ట్రంలో అధికారం చేపట్టాలనే ఉద్దేశంతో దూకుడుగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్‌కు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన యాత్ర టానిక్‌లా పని చేసింది. శుక్రవారం జిల్లాలో రెండుచోట్ల నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లలో పాల్గొన్న రాహుల్ గాంధీ.. అన్నీ తానై వ్యవహరిస్తూ పార్టీ తరఫున ప్రజలకు హామీలిచ్చారు. అగ్రనేత పర్యటన విజయవంతం కావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది.

జిల్లాలో ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ పర్యటన సుమారు నాలుగు గంటలపాటు సాగింది. షెడ్యూల్ ప్రకారం రాహుల్ గాంధీ మోర్తాడ్‌కు మధ్యాహ్నం రెండు గంటలకు చేరుకోవాల్సి ఉంది. అరగంట ఆలస్యంగా మోర్తాడ్‌కు వచ్చిన ఆయన 20 నిమిషాల పాటు హిందీలో ప్రసంగించారు. ఆ తర్వాత ఆర్మూర్‌కు బయలుదేరిన రాహుల్.. మార్గమధ్యలో వేల్పూర్ మండలం పడిగెల్ వద్ద టీ తాగారు. స్థానికులతో కలిసి మాట్లాడి, సమస్యలు తెలుసుకున్నారు. అక్కడి నుంచి ఆర్మూర్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్దకు చేరుకుని కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించారు. రెండుచోట్ల నిర్వహించిన సమావేశాల్లో రాహుల్ గాంధీ ఒక్కరే మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన జాతీయ నేతలు, రాష్ట్ర నాయకులు ఆయన వెంట ఉన్నా ఎవరికీ ప్రసంగించడానికి అవకాశం ఇవ్వలేదు. రాష్ట్ర కాంగ్రెస్ మేనిఫెస్టోను తన ప్రసంగం ద్వారా రాహులే ప్రజలకు వినిపించారు. రెండుచోట్ల ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాహుల్ ప్రసంగాన్ని తెలుగులోకి అనువదించారు. కాంగ్రెస్ అభ్యర్థులను రాహుల్ గాంధీనే స్వయంగా ప్రజలకు పరిచయం చేస్తూ భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఎంఐఎంతో సన్నిహితంగా ఉన్నా ఈసారి మాత్రం ఆ పార్టీని కూడా రాహుల్ టార్గెట్ చేయడం గమనార్హం. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంలు మూడూ ఒక్కటే అని రాహుల్ తన ప్రసంగంలో పదేపదే పేర్కొన్నారు. ఆర్మూర్‌లో సమావేశం అనంతరం రాహుల్ గాంధీ రోడ్డు మార్గంలో నిజామాబాద్, డిచ్‌పల్లి మీదుగా హైదరాబాద్‌కు వెళ్లారు.

బాల్కొండలో ప్రచారం ప్రారంభం

కాంగ్రెస్ పార్టీకి గతంలో కంచుకోటగా ఉన్న బాల్కొండ నియోజకవర్గంలో 2014, 2018 ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులు ఓటమిపాలయ్యారు. ఈసారి ఎలాగైనా విజయం సాధించాలన్న తపనతో ఉన్న పార్టీ శ్రేణులకు ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత, 2018 ఎన్నికల్లో బీఎస్పీ తరఫున పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన ముత్యాల సునీల్‌రెడ్డి చేరిక బలాన్ని ఇచ్చింది. ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ జిల్లాలో ఎన్నికల ప్రచారాన్ని మోర్తాడ్ వేదిక నుంచి ఆరంభించడం, కార్నర్ మీటింగ్‌లో విజయవంతం కావడంతో పార్టీ నాయకులు ఉత్సాహంతో ఉన్నారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకరావాలనే ఉత్సాహంతో ఉన్న నాయకులకు రాహుల్ సభ నయా జోష్ ఇచ్చిందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఊపిరి పీల్చుకున్న పోలీసులు

షెడ్యూల్ ప్రకారం మోర్తాడ్‌లో రాహుల్ గాంధీ కార్నర్ సమావేశం ఉండదనే ఉద్దేశంతో ఇక్కడ బందోబస్తు కోసం తక్కువ మంది సిబ్బందిని కేటాయించారు. భీమ్‌గల్ సీఐ వెంకటేశ్వర్లు, మోర్తాడ్ ఎస్సై అనిల్‌రెడ్డిల ఆధ్వర్యంలో కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, భీమ్‌గల్ ఎస్సైలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. మోర్తాడ్ బస్టాండ్, మండల కార్యాలయాలు, పాలెం, తిమ్మాపూర్ క్రాస్ రోడ్డుల నుంచి బందోబస్తుకు పక్కాగా ప్లాన్ చేసిన అధికారులు సిబ్బందిని నియమించారు. సిబ్బంది సంఖ్య ఎంత ఉన్నా ఎలాంటి ఇబ్బంది కలుగకుండా కార్నర్ మీటింగ్ సాఫీగా సాగడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.





పెర్కిట్ హైవే చౌరస్తా వద్ద కార్లు, బైక్‌ల ర్యాలీ

రైతులను మోసం చేసేందుకు మోదీ కుట్ర

పసుపు బోర్డు పేరుతో నాటకం

- కార్నర్ మీటింగ్‌లలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ
- ఆర్మూర్, మోర్తాడ్‌లో కాంగ్రెస్ విజయభేరి యాత్ర

ఆర్మూర్/మోర్తాడ్: గత పార్లమెంట్ ఎన్నికల్లో పసుపు రైతులను తప్పుడు వాగ్దానాలతో మోసం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ నాయకులు తాజాగా పది రోజుల నుంచి మరోమారు పసుపు బోర్డు అంటూ ప్రకటనలు చేస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. నాలుగున్నరేళ్లుగా పసుపు రైతులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోకుండా ఎన్నికల వేళ మళ్లీ మోసం చేసే కుట్ర చేస్తున్నారన్నారు. విజయభేరి బస్సు యాత్రలో భాగంగా ఆయన ఆర్మూర్ పట్టణ శివారులోని పెర్కిట్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు ఏటా ప్రతి ఎకరానికి రూ. 15 వేలు, రైతు కూలీలకు రూ. 12 వేల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. పసుపు పంటకు క్వింటాలుకు రూ. 12 వేల నుంచి రూ. 15 వేల వరకు గిట్టుబాటు ధర ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రతి పంటకు ఎంఎస్పీపై రూ. 500 బోనస్ చెల్లిస్తామన్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకంలో భాగంగా నెలకు రూ. 2,500 ఆర్థికసాయం, ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. 200 యూనిట్ల వరకు విద్యుత్ బిల్లులను మాఫీ చేస్తామన్నారు.

కాంగ్రెస్ కార్యకర్త పులితో సమానం..

కాంగ్రెస్‌లో ఒక్కో కార్యకర్త ఒక్కో పులితో సమానమంటూ రాహుల్‌గాంధీ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు. మొన్నటివరకు చొక్కా విప్పి తిరిగిన బీజేపీ నాయకులు ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. అలంటి వారిని పార్టీలో చేర్చుకునేది లేదన్నారు. బోధన్, ఆర్మూర్, బాల్కొండ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులైన సుదర్శన్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, సునీల్‌రెడ్డిలను భారీ మెజారిటీతో గెలిపించాలని రాహుల్‌గాంధీ కోరారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నాయకుడు బట్టి విక్రమార్క, సీనియర్ నాయకులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మధు యాష్కీగౌడ్, కేసీ వేణుగోపాల్, బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, మానాల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. నేనున్నా

- మానాలను బుజ్జగించిన రాహుల్‌గాంధీ



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : బాల్కొండ టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నించి విఫలమైన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డిని పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ బుజ్జగించారు. శుక్రవారం రాహుల్ జిల్లా పర్యటన నేపథ్యంలో ఆర్మూర్ సభ వద్ద పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మానాలను రాహుల్ వద్దకు తీసుకెళ్లారు. మానాలతో మాట్లాడిన రాహుల్ టికెట్ దక్కలేదని అధైర్యపడవద్దని చెప్పి బుజ్జగించారు. నీ విషయం నేను చూసుకుంటానని, బాధపడొద్దని రాహుల్ మోహన్ రెడ్డికి సూచించారు.





ఆర్మూర్‌లోని కార్నర్ మీటింగ్‌లో సుదర్శన్ రెడ్డి, వినయ్‌కుమార్ రెడ్డిలను పరిచయం చేస్తున్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ



మోర్తాడ్‌లో సునీల్ రెడ్డిని పరిచయం చేస్తూ..

సామాన్యుడికి 'నగదు' కష్టాలు!

- బ్యాంకులు, వ్యాపార కూడళ్ల వద్ద పోలీసుల తనిఖీలు
- కొన్నిచోట్ల అతిగా వ్యవహరిస్తున్న తనిఖీ బృందాలు
- పెళ్లిళ్లకు బంగారం, దుస్తులు కొనడానికి ఇబ్బంది పడుతున్న జనం
- దుకాణాల నుంచి ఇంటికి డబ్బులు తీసుకెళ్లాలన్నా భయమే..



కామారెడ్డిలో ప్రధాన రహదారిపై బ్యాంకుల వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

సాక్షి, కామారెడ్డి: కూతురు పెళ్లి కోసం బంగారం కొనడానికి వెళ్లాలంటే నాన్నకు భయం.. పండుగ పూట కుటుంబం అంతా షాపింగ్‌కు వెళ్లాలంటే జంకు.. దసరా సీజన్‌లో వచ్చిన డబ్బులను ఇంటికి తీసుకెళ్లడానికి ఆలోచిస్తున్న ఓ వ్యాపారి.. వెంట తీసుకెళ్లిన డబ్బులను ఎన్నికల తనిఖీల్లో భాగంగా పోలీసులు పట్టుకుంటారని ఇలా సామన్యులు భయపడుతున్నారు. ఎన్నికల్లో నగదు పంపిణీని కట్టడి చేయడానికి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్వహించే వాహనాల తనిఖీలతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల తనిఖీ బృందాలు అతిగా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. పెళ్లిళ్ల సీజన్ కావడంతో బంగారం కొనుగోలు చేయడానికి, షాపింగ్ కోసం డబ్బులు తీసుకుని వెళ్లడానికి కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వ్యాపారులు కూడా షాపు కట్టేసిన తరువాత డబ్బులను ఇంటికి తీసుకు వెళుతుంటారు. వెళ్లేటపుడు పోలీసులు తనిఖీ చేసి స్వాధీనం చేసుకుంటుండడంతో ఆందోళన చెందుతున్నారు. కామారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ నుంచి నిజాంసాగర్ చౌరస్తా వరకు ఐదారు బ్యాంకులు ఉన్నాయి. డబ్బులు బ్యాంకుల్లో జమ చేయడానికి వెళ్లాలంటేనే జనం భయపడుతున్నారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలో బ్యాంకుల ఎదుటే తనిఖీలు చేపడుతుండడంతో డబ్బులను జమ చేయడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారుల అవస్థలు

తమ వ్యాపారాలకు సంబంధించి దుకాణంలో జమ అయిన డబ్బులను చాలా మంది రాత్రి పూట ఇంటికి తీసుకెళ్తారు. కామారెడ్డి పట్టణంలో మెడికల్ ఏజెన్సీలు, సూపర్ మార్కెట్లు, బంగారం, బట్టల దుకాణాలు... ఇలా వ్యాపారులంతా రాత్రి షాప్ క్లోజ్ చేసి అప్పటి వరకు జమ అయిన డబ్బులను వెంట తీసుకు వెళ్తారు. భారీ మొత్తంలో డబ్బులు ఉన్నపుడు పోలీసులు ఆపితే లెక్క చూపని సందర్భంలో స్వాధీనం చేసుకుంటారని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. రాజకీయ పార్టీల వాళ్లు డబ్బులు అక్రమంగా తరలిస్తే పట్టుకోవాలని, వ్యాపారాలు చేసుకునే వారిని ఇబ్బంది పెట్టడం సరికాదని వారు అంటున్నారు.

పెళ్లిళ్ల సీజన్‌తో..

శుభముహూర్తాలు ఉండడంతో పెళ్లిళ్లు, ఫంక్షన్లు నిశ్చయం చేసుకున్న వారు అవసరమైన ఆభరణాలు చేయించడానికి బంగారం కొనుగోలు కోసం వెళ్లేందుకు వెంట డబ్బులు తీసుకెళ్లడం ఇబ్బందికరంగా మారింది. తులం బంగారం కొనాలంటే రూ.62 వేలు అవసరం. పెళ్లిళ్లలో తక్కువలో తక్కువ ఐదు తులాల నుంచి ఇరవై తులాల వరకు బంగారం కొనుగోలు చేయాల్సి ఉంటుంది. రూ.లక్షలు వెంట తీసుకువెళితే పోలీసులు ఎక్కడ ఆపి ఇబ్బంది పెడతారోనని ఆందోళన చెందుతున్నారు. పెళ్లి దుస్తులు కొనడానికి కూడా పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. అంత డబ్బు వెంట తీసుకు వెళితే తనిఖీలతో ఇబ్బంది పెడతారేమోనని ఆందోళన చెందుతున్నారు. నవంబర్‌లో శుభ ముహూర్తాలు ఉన్నాయి. దీంతో ముందుగా బంగారం, దుస్తులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అలాగే ఫంక్షన్ హాళ్లకు అడ్వాన్సులు చెల్లించాల్సిన పరిస్థితుల్లో రూ.50వేల కన్నా ఎక్కువ తీసుకువెళితే ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

పకడ్బందీగా ర్యాండమైజేషన్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: పకడ్బందీగా ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపడుతున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. మొదటి ర్యాండమైజేషన్ పూర్తయిన వెంటనే కంట్రోల్ యూనిట్లు, బ్యాలట్ యూనిట్లు, వీవీ ప్యాట్లను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచాలని అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్లతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 6,61,163 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 791 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి కంట్రోల్ యూనిట్లు, బ్యాలట్ యూనిట్లు 25 శాతం, వీవీ ప్యాట్ యంత్రాలను 40 శాతం అదనంగా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. మొదటి ర్యాండమైజేషన్‌లో భాగంగా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా యంత్రాల కేటాయింపులు పూర్తి చేయడానికి శనివారం ఉదయం 8 గంటల వరకు ఈవీఎం గోదాములకు రావాలని సూచించారు. రెండో దఫాలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ జరుగుతుందన్నారు. నవంబర్ 28న మూడో ర్యాండమైజేషన్‌లో కంట్రోల్ యూనిట్లు, బ్యాలట్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లను పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి సిద్ధం చేస్తామన్నారు. ఆయా పార్టీల వారు పోలింగ్ ఏజెంట్లను త్వరగా నియమించుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బలం బలగం రెండూ ఉన్నాయి

- మన విజయంతో ప్రత్యర్థుల దిమ్మ తిరగాలి
- ఎన్నికల సన్నాహక సమావేశంలో స్పీకర్ పోచారం



కార్యకర్తలతో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ: మనకు బలం బలగం రెండూ ఉన్నాయని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బాన్సువాడలో పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని రూ.10 వేల కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. ప్రజలను ఓట్లు అడిగే హక్కు ఒక్క బీఆర్ఎస్‌కే ఉందన్నారు. మన విజయం ప్రత్యర్థులకు దిమ్మ తిరిగేలా ఉండాలన్నారు. నియోజకవర్గంలో ఆరు నెలల క్రితం 64 శాతం ఉన్న ప్రజామోదం ప్రస్తుతం 76 శాతానికి చేరిందని పేర్కొన్నారు. ఈనెల 30న బాన్సువాడలో నిర్వహించే సీఎం సభకు లక్షమంది తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. నవంబర్ 4న నామినేషన్ వేస్తానన్నారు. నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

జిల్లా కోర్టులో బతుకమ్మ పండుగ



ఖలీల్‌వాడి: జిల్లా కోర్టు ఆవరణలో బతుకమ్మ పండుగను శుక్రవారం నిర్వహించారు. చంద్రయాన్ తరహాలో బతుకమ్మను తయారు చేశారు. బతుకమ్మ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. న్యాయమూర్తులు, కోర్టు మహిళా సిబ్బంది బతుకమ్మ ఆడుతూ పాటలు పాడారు. అనంతరం బతుకమ్మను నిమజ్జనం చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, జూనియర్ సివిల్ జడ్జి ఖుష్బూ, సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



మాక్లూర్: మండలంలో సమస్యాత్మకంగా ఉండే పోలింగ్ కేంద్రాలను ఏసీపీ కిరణ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ముందు జాగ్రతగా తీసుకోవాల్సిన చర్యలు, ఏర్పాట్లపై సీఐ, ఎస్సైతో చర్చించారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు చేయాలని సూచించారు. మండలంలో ఆరు పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించినట్టు తెలిపారు. ఆయన వెంట నార్త్‌జోన్ సీఐ సతీశ్, స్థానిక ఎస్సై సుదీర్‌రావు, సిబ్బంది ఉన్నారు.

సిరికొండ మండలంలో..



సిరికొండ: మండలంలోని న్యావనంది, రావుట్ల, గడ్కోల్, జంగిలోడి తండా తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ధర్పల్లి సీఐ సైదా తనిఖీ చేశారు. కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలను సీఐ పరిశీలించారు. కొన్ని కేంద్రాల వద్ద ర్యాంపులు శిథిలావస్థకు చేరాయని, మరమ్మత్తులు చేయించాలని సిబ్బందికి సూచించినట్లు సీఐ తెలిపారు. ఎస్సై రమేష్, సిబ్బంది ఉన్నారు.

నేడు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



డిచ్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్ డిచ్‌పల్లిలో శనివారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కమాండెంట్ రాంప్రకాశ్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆర్ఐ శ్యాంరావు, ఆర్ఎస్సై చంద్రశేఖర్‌లు పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులను వారి ఇళ్లకు చేరి సంస్మరణ దినోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు. వారి వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

రాహుల్ గాంధీకి ఘన స్వాగతం



పెర్కిట్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు



ఆర్మూర్ అంబేద్కర్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న జనం

- ఆర్మూర్‌కు చేరిన విజయభేరి బస్సు యాత్ర
- పెర్కిట్ నుంచి ఆర్మూర్ వరకు బైక్ ర్యాలీ

ఆర్మూర్/ పెర్కిట్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏఐసీసీ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన విజయ భేరి బస్సు యాత్ర శుక్రవారం ఆర్మూర్ పట్టణానికి చేరుకోవడంతో పార్టీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. జగిత్యాల జిల్లాలో పర్యటన ముగించుకొని బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని మోర్తాడ్ నుంచి ఆర్మూర్‌కు వచ్చిన ఆయనకు పెర్కిట్ శివారులో పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి పెర్కిట్, మామిడిపల్లి చౌరస్తా, కొత్త బస్టాండ్ మీదుగా ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాకు సాయంత్రం 4:10 గంటలకు చేరుకున్న రాహుల్ గాంధీ తన ప్రసంగాన్ని 4:50 నిమిషాలకు ముగించారు. అత్యవసర నిమిత్తం నిజామాబాద్ జిల్లా కేంద్ర పర్యటనను రద్దు చేసుకొని రోడ్డు మార్గం గుండానే హైదరాబాద్‌కు వెళ్లారు. రాహుల్ గాంధీ పర్యటన సందర్భంగా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా ఆర్మూర్ పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఆర్మూర్ మీదుగా నిజామాబాద్ వైపు వెళ్లే వాహనాలను డిచ్‌పల్లి వైపు మరలించారు. భారీ బందోబస్తును సైతం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదు.

భిక్కనూరులో ఆగిన రాహుల్

భిక్కనూరు: నిజామాబాద్ జిల్లా పర్యటన ముగించుకుని రోడ్డు మార్గంలో హైదరాబాద్ వెళ్తున్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ.. మార్గమధ్యలో భిక్కనూరు మండలకేంద్ర సమీపంలోని దాబా వద్ద కాసేపు ఆగారు. ఆయన వ్యక్తిగత భద్రత సిబ్బంది మొదట దాబాలోకి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. తర్వాత రాహుల్ గాంధీ దాబాలోకి వెళ్లి కాలకృత్యాలు తీర్చుకుని, హైదరాబాద్ వెళ్లిపోయారు.

రాహుల్‌గాంధీ వస్తాడని ఊహించలేదు



వేల్పూర్: చాయి హోటల్ నడుపుకొనే తమ వద్దకు ఇందిరాగాంధీ మనుమడు రాహుల్‌గాంధీ రావడం చాలా సంతోషంగా ఉందని, ఆయన మా వద్దకు వస్తాడని ఏనాడు అనుకోలేదని మండలంలోని పడగల్ ఒడ్డెర కాలనీ హోటల్ నిర్వాహకులు పోశెట్టి, ఒడ్డెమ్మ దంపతులు పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం చాలా కార్లు మా హోటల్‌కు ఎదురుగా ఆగాయని, అందులోంచి రాహుల్‌గాంధీ వచ్చి కూర్చున్నారని, దాంతో మాకు సంతోషం కలిగి ఏం చేయాలో తోచలేదన్నారు. వెంటనే రెండు పాల ప్యాకెట్లు, కట్టెలు



తెగానే ఎమ్మెల్యే సీతక్క చాయి చేసిందని తెలిపారు. సంసారం ఎలా గడుస్తోందని అడుగగా అప్పట్లో ఇందిరమ్మ ఇచ్చిన రేకుల ఇంట్లోనే ఉంటున్నామని, ఐదుగురు మనుమలు, మనుమరాండ్లతో 11 మందితో ఉంటున్నామని తెలిపారు. మాటలు రాని కుమారుడితో హోటల్ నడుపుకొంటూ ఎలాంటి ఆధారం లేకుండా జీవిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, మా బతుకులు బాగు పడతాయని రాహుల్‌గాంధీ చెప్పారని వారు పేర్కొన్నారు.

లారీని ఎత్తుకెళ్లిన డ్రైవర్ అరెస్ట్

ఖలీల్‌వాడి: ఓనర్ లారీని స్నేహితులతో కలిసి ఎత్తుకెళ్లిన డ్రైవర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్ టౌన్ సీఐ నరహరి తెలిపారు. నగరంలోని మూడో టౌన్ పీఎస్ పరిధిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని నిజాంకాలనీకి చెందిన సయ్యద్ హైమద్ వద్ద ఆటోనగర్‌కు చెందిన షేక్ అంజాద్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 14న సాయంత్రం లారీని డ్రైవర్ శ్రద్ధానంద్‌గంజ్‌లో పార్క్ చేసి ఇంటికి వెళ్లాడు. 17న గంజ్‌లో లారీ కనిపించక పోవడంతో ఓనర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డ్రైవర్ షేక్ అంజాద్‌పై అనుమానం రావడంతో పోలీసులు అతన్ని పట్టుకొని విచారించారు. విచారణలో లారీని తన మిత్రులు సయ్యద్ సోహైల్, షేక్ షోయబ్‌తో కలిసి దొంగిలించినట్లు నిందితుడు అంజాద్ ఒప్పుకున్నాడు. లారీని మహారాష్ట్రకు చెందిన ఓ బోకర్ సహాయంతో పార్టులను విడదీసి అమ్మాలని ప్లాన్‌చేశారు. కానీ పోలీసులు త్వరగా విచారణ చేపట్టి నిందితులను పట్టుకొని లారీని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై ప్రవీణ్‌కుమార్, కానిస్టేబుళ్లు వాహబ్, అఫ్సర్, ఎస్‌కే షౌకత్ అలీ, జె.బాబు, వి.చామింద్ ఉన్నారు.



మాట్లాడుతున్న సీఐ నరహరి, ఎస్సై ప్రవీణ్‌కుమార్

కాంగ్రెస్‌లో చేరి.. మళ్లీ గులాబీ గూటికి..

రెంజల్: నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కుతుంది. పలువురు పార్టీలు మారుతూ నాయకులకు తికమకకు గురి చేస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే షకీల్ అహ్మద్ బీఫాం తెచ్చుకుని ప్రచార పర్వాన్ని జోరు పెంచుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి సైతం అదే ఊపును కొనసాగిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి ఇంకా తేలక పోవడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో ఇప్పటికే కప్పగంతులు ఎక్కువయ్యాయి. బోర్గాం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు యాసాడం భూమయ్య తనకు అన్యాయం జరిగిందని రెండు రోజుల క్రితం మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రెండు రోజులకే మనసు మార్చుకుని శుక్రవారం బోధన్‌లోని షకీల్ అహ్మద్ నివాసంలో తిరిగి సొంతతగూటికి చేరారు.



బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకుడు

సైన్స్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సిద్ధిరాంరెడ్డి



కామారెడ్డి టౌన్: రాష్ట్ర సైన్స్ అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని హైదరాబాద్‌లోని కార్యాలయంలో శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా సైన్స్ అధికారి ఎం. సిద్ధిరామ్‌రెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 33 జిల్లాల సైన్స్ అధికారులతో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందని అన్నారు.

నేడు నగరంలో భవాని ర్యాలీ

నిజామాబాద్ సిటీ: నగరంలో నేడు భవాని ర్యాలీ నిర్వహించనున్నట్లు భవాని ర్యాలీ వ్యవస్థాపకుడు పబ్బ సాయిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం నగరంలోని పోచమ్మగల్లి పోచమ్మ మందిరం నుంచి దేవిరోడ్డు దేవి మందిరం వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. భవాని మాలధారణ స్వాములు. భక్తులు, ప్రజలు ఈ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి

నిజామాబాద్ రూరల్: గూపన్‌పల్లి శివారులో రెండు పాడిగేదెలు విద్యుదాఘాతానికి గురై శుక్రవారం మృతి చెందాయి. గూపన్‌పల్లికి చెందిన పోతన్న, గంగస్థాన్ ప్రాంతానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ గేదెలు స్థానిక శివారులో మేతకు వెళ్లగా విద్యుత్ స్తంభానికి కిందికి బిగించిన విద్యుత్‌వైర్లు తగలడంతో మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం, విద్యుత్ అధికారులు స్పందించిన నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్

బైక్‌ల చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్



డిచ్‌పల్లి పోలీసులకు పట్టుబడిన బైక్‌లు, నిందితులు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి, నిజామాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పార్క్ చేసిన ద్విచక్రవాహనాలను దొంగిలించిన నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిచ్‌పల్లి సీఐ కె.కృష్ణ శుక్రవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ ఫాండు ఫారం నివాసి ఖాజా మొయినుద్దీన్, డిచ్‌పల్లి మండలం నడిపల్లికి చెందిన రుద్రబోయిన గణేశ్, బోర్గాం(పి)కి చెందిన రచ్చ రాజు, నిర్మల్ జిల్లాకు చెందిన షేక్ అజీమ్‌లు ఒక బృందంగా ఏర్పడి బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నారు. సెప్టెంబర్ 17న డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ గ్రామం ఇస్లాంపురా కాలనీకి చెందిన జహీర్ అహ్మద్ తన బైక్‌ను ఇంటి ఎదుట పెట్టి హైదరాబాద్‌కు వెళ్లాడు. నిందితులు బైక్‌ను దొంగిలించడంతో జహీర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సదరు నిందితులు గురువారం దొంగిలించిన బైక్‌పై నంబర్ ప్లేట్ లేకుండా డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. వారిని విచారించగా తాము బైక్‌లను దొంగిలించినట్లు అంగీకరించారు. వాటిని ఎలా అమ్మాలో తెలియక నడిపల్లికి చెందిన రచ్చ రాజు ఇంటి వద్ద ఉంచినట్లు తెలిపారు. దీంతో రాజు ఇంటి వద్ద ఉంచిన 8 బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకుని నలుగురి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

పలువురి బైండోవర్

ధర్పల్లి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 8 మందిని తహసీల్దార్ మాలతి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. వీరిపై గతంలో కేసులు నమోదు కాగా, పాత నేరస్తులుగా పరిగణించి బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

బాల్కొండ: ముప్కాల్ మండలం నల్లూర్ శివారులో జాతీయ రహదారిపై గురువారం అదుపు తప్పి కారు బోల్తాపడిన ఘటనలో తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్ అయూబ్‌ఖాన్(51) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై భాస్కరాచారి శుక్రవారం తెలిపారు. హైదరాబాద్ నుంచి అయూబ్‌ఖాన్ కారులో ఆదిలాబాద్‌కు వెళ్తుండగా అదుపుతప్పి నల్లూరు శివారులో బోల్తాపడిందన్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి ..

సదాశివనగర్: మండలంలోని భూంపల్లి శివారులో అదృశ్యమైన వ్యక్తి గ్రామ శివారు కాలువలో శవమై తేలాడు. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం..భూంపల్లికి చెందిన నర్సింలు(26) ఈ నెల 15న గడ్డి తీసుకొస్తానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఈ విషయమై పీఎస్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కాలువలో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై నర్సింలు మృతదేహంగా గుర్తించారు. కాలువపై ప్రయాణిస్తుండగా బైక్ అదుపు తప్పి ప్రమాదవశాత్తు పడిపోవడంతో మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ట్రాక్టర్ కింద పడి పంచాయతీ కార్మికుడు..

డిచ్‌పల్లి: మండలంలోని యానంపల్లిలో గ్రామ పంచాయతీ వర్కర్‌గా పనిచేస్తున్న రాజన్న(57) ట్రాక్టర్ కింద పడి శుక్రవారం మృతి చెందాడు. గ్రామంలో జీపీ ట్రాక్టర్‌పై చెత్త సేకరిస్తూ ఉండగా ప్రమాదవశాత్తు అదే ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. మృతుడి భార్య గంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.



రాజన్న మృతదేహం

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

దౌల్తాబాద్(దుబ్బాక): నిజామాబాద్ జిల్లాకు చెందిన ఒకరు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన దౌల్తాబాద్ మండల పరిధిలోని హైమద్‌నగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా మోస్రా మండలం గోవూరు గ్రామానికి చెందిన పోసంగారి భాస్కర్‌రెడ్డి (45) తన కుటుంబంతో కలిసి కొంత కాలంగా మేడ్చల్‌లో ఎలక్ట్రిషన్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. గురువారం ఉదయం ఇంట్లో చెప్పకుండా వెళ్లిన భాస్కర్ తిరిగి రాలేదు. భార్య లక్ష్మి భాస్కర్‌రెడ్డికి ఫోన్ చేయగా తాను వేరే ఊరికి వెళ్లానని, నువ్వు కూడా పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లమని భార్యకు తెలిపాడు. దీంతో లక్ష్మి పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లింది. శుక్రవారం ఉదయం భాస్కర్‌రెడ్డికి తెలిసిన తిరుమలాపూర్‌కు చెందిన యాదవరెడ్డి మీ భర్త తన ఇంట్లో మృతి చెందాడని లక్ష్మికి సమాచారం అందించాడు. దీంతో భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నాలుగు కిలోల వెండి పట్టివేత

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని గాంధీ గంజ్‌లో బంగారు దుకాణాల వద్ద పట్టణ పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఇద్దరి నుంచి వెండి, వెండితో తయారు చేసిన నాలుగు కిలోల ఆభరణాలను పట్టుకున్నట్లు సీఐ నరేశ్ శుక్రవారం తెలిపారు. గాంధీ గంజ్‌లో సరైనా ఆధారాలు లేకుండా హైదరాబాద్‌కు చెందిన వ్యాపారులు ప్రతీక్, ప్రదీప్‌లు బైక్‌పై వెళ్తుండగా వారి నుంచి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ పోలీసులకు వెండిని అప్పగించినట్లు తెలిపారు.





స్వాధీనం చేసుకున్న వెండితో పోలీసులు

రైలులో గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎస్సై

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో విజయవాడ-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ ఎస్–5 బోగీ నుంచి 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే ఎస్సై తావూనాయక్ శుక్రవారం తెలిపారు. విశాఖ నుంచి షిర్డీకి వెళ్తున్న ఈ రైలును కామారెడ్డి నుంచి నిజామాబాద్ వరకు తనిఖీ చేయగా ఎస్–5 బోగీలో గంజాయి దొరికినట్లు చెప్పారు. దీని విలువ సుమారు రూ.6.25 లక్షల వరకు ఉంటుందన్నారు. వీటిని విశాఖ నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు రైల్వే పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా గంజాయి తరలిస్తున్న వారు ఎవరూ దొరకలేదని ఎస్సై పేర్కొన్నారు.

కందర్‌పల్లిలో..



పట్టుకున్న గంజాయితో పోలీసులు

బిచ్కుంద: మండలంలోని కందర్‌పల్లిలో ఎక్సైజ్ పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన శ్యాంరావు ఇంట్లో గంజాయి ఉన్నట్లు సమాచారం అందడంతో డీటీఎఫ్ సీఐ సుందల్‌సింగ్, ఎస్సై అభిషేక్ తనిఖీ చేయగా 550 గ్రాముల ఎండు గంజాయి లభించిందన్నారు. గతంలో శ్యాంరావు, అతని భార్యపై కేసు నమోదైనా వారిలో మార్పు రాకపోవడం, అధికారుల ఆదేశాలను అతిక్రమించినందుకు రూ. రెండు లక్షల జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు. అనంతరం శ్యాంరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎస్సై మమత, సిబ్బంది ఉన్నారు.

రైలు కిందపడి తండ్రీకూతుళ్ల మృతి

ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో కదులుతున్న రైలు ఎక్కుతూ కిందపడి తండ్రి, కూతురు మృతిచెందినట్లు నిజామాబాద్ రైల్వే ఎస్సై తావునాయక్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని చింతల్‌కు చెందిన రాంచందర్ రావు(40) కుటుంబ సభ్యులు నిర్మల్ జిల్లాలోని బాసర సరస్వతి దేవి దర్శనం కోసం పర్బణి ఎక్స్‌ప్రెస్‌లో బాసరకు సీట్లు రిజర్వేషన్ చేసుకున్నారు. రైలులో ఎస్–8 బోగీలో రెండు సీట్లు రాంచందర్‌రావు కూతుళ్లకు రిజర్వ్ కాగా, ఎస్–4 రాంచందర్‌రావు దంపతులకు రిజర్వ్ అయ్యాయి. వీరు హైదరాబాద్ నుంచి నిజామాబాద్ చేరుకున్నారు. నిజామాబాద్‌లో ఇతర ప్రయాణికులు దిగిపోవడంతో రాంచందర్‌రావు కూతుళ్లకు ఫోన్ చేసి తమ దగ్గర సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పాడు.

అనంతరం వారిని తీసుకుని తామున్న బోగీలోకి ఎక్కించేందుకు ప్రయత్నించాడు. ఇందులో భాగంగా పెద్ద కూతురును బోగీలోకి ఎక్కించిన అనంతరం చిన్నకూతురు(14)ను ఎక్కిస్తుండగా రైలు కదలడంతో చిన్నకూతురు రైలుకింద పడిపోయింది. ఆమెను కాపాడే ప్రయత్నంలో తండ్రికి సైతం తీవ్ర గాయాలయ్యాయి. రాంచందర్‌రావు నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. రాంచందర్‌రావు బంధువు వేముల మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని రైల్వే ఎస్సై తెలిపారు.

తనిఖీలో నగదు పట్టివేత

బోధన్ రూరల్/ బాన్సువాడ: సాలూర అంతరాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద మహారాష్ట్ర నుంచి తెలంగాణ వైపు అంబులెన్స్‌లో వస్తున్న పవన్‌కుమార్‌సింగ్ నుంచి రూ.5,11,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. ఆధారాలు లేకుండా తరలిస్తున్నందున పట్టుబడిన నగదును అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. అనంతరం సాలూర చెక్‌పోస్ట్‌ను సీఐ శ్రీనివాస్‌రాజ్ పరిశీలించారు. బాన్సువాడ పట్టణంలోని వాహనాల తనిఖీలో భాగంగా ఒకరి నుంచి రూ. రెండు లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నగదును ఎఫ్ఎస్‌సీకి అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

ఎడపల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై విక్రం తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన మాల నడిపి లింగయ్య (55) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో కొంత కాలంగా ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.